క్లుప్తంగా...

5న క్రికెట్ టోర్నమెంట్

శేరిలింగంపల్లి: పురం విశ్వకాంత్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శేరిలింగంపల్లి లేగల క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవాలన్నారు. ఫైనల్ మ్యాచ్ జూన్ 13వ తేదీ నిర్వహిస్తామన్నారు. విజేతకు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.25 వేల నగదును అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్స్ 9885755759, 9247924782లలో సంప్రదించాలన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'ఎక్స్‌పీరియన్సింగ్ హెల్దీ లైఫ్–ది నేచర్స్ వే' అనే అంశంపై గుజరాత్‌కు చెందిన న్యాచురోపతి సీనియర్ కన్సల్టెంట్ బి.కె. డాక్టర్ లలిత్‌బాయ్ పంచాల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. కార్యక్రమంపై మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

'మనూ'లో డిబేట్, పాటల పోటీలు

రాయదుర్గం: మనూలో జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉపన్యాసం (డిబేట్), పాటల పోటీలను నిర్వహించారు. విజేతలను శుక్రవారం ప్రకటించారు. షోయాబుర్ రహమాన్, ఎండీ సోహ్రాబ్ ఆలమ్, ఎం.డీ యూసుఫ్ వరుసగా ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్ భాషలలో ఉపన్యాస పోటీలలో విజేతలుగా కాగా పాటల పోటీలలో మహ్మద్ అర్పిన్ విజేతగా నిలిచారు. ఈ పోటీలను ముస్తాక్ అహ్మద్ పటేల్ పర్యవేక్షించారు. డాక్టర్ ఖైసర్‌మహ్మద్, డాక్టర్ ఫర్హత్‌అలీ, డాక్టర్ ఎండి.రషీద్ ఫారూఖీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

వ్యాసరచనలో విజేతలు వీరే..

ఉర్దూ యూనివర్సిటీలో వ్యాస రచన పోటీలను ఉర్దూ, ఇంగ్లిష్, హిందీ భాషలలో వేర్వేరుగా నిర్వహించారు. అందులో ప్రతి భాషలో ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. అందులో ఇంగ్లిషలో సహానా షెరీన్, ఫాహద్‌కలీక్, మహ్మద్ యూసుఫ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హిందీ భాషలో బుష్రాఫాతిమా,టి మన్నన్, జియావుల్లా అన్సారీ, ఉర్దూ భాషలో అబ్దుల్ అజీమ్, మహ్మద్ అబ్దుల్లా, మజార్ సుబాని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

'మనూ'లో మరో కొత్త కోర్సు ప్రారంభం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుడుతున్నారు. ఉర్దూ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్‌లో కొత్తగా పీహెచ్‌డీ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సులో అడ్మిషన్ల కోసం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షను హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఉర్దూ సంస్కృతి, భాషా, సాంస్కృతిక పరిభాష, సామెతలు, ఉర్దూ సాహిత్యంలో సాంస్కృతిక వర్ణన, మిశ్రమ సంస్కృతి, బహుళ సాంస్కృతికత, జాతి వైవిధ్యం, భారతీయ సంస్కృతి, ప్రాంతీయ సంస్కృతి, ఇండో–ఇస్లామిక్ సంస్కృతి, జానపద సంస్కృతి, పట్టణ సంస్కృతి, గిరిజన సంస్కృతి, జానపద కళ, జానపద సాహిత్యం వంటి అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 28. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

ప్రార్థనా స్థలాలు.. పవిత్ర స్థలాలు: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రార్థనా స్థలాలు పవిత్ర స్థలాలు అని, వాటిని పారదర్శకంగా నిర్వహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ బంజార దర్వాజ అల్జాపూర్‌లోని కుతుబ్‌షాహీ మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుతుబ్‌షాహీ రాజుల నాటి ఈ మసీదుకు కొత్త రూపం ఇచ్చిన మసీదు నిర్వహణ కమిటీ వారిని ఆయన అభినందించారు. మసీదుకు ప్రార్థనలకు వచ్చే వారు మసీదు పరిరక్షణ, నిర్వహణ విషయంపై కూడా చొరవ చూపాలన్నారు. మసీదులపై వివాదాలు లేకుండా నిర్వహణ కమిటీ వారిపై ఆరోపణలు లేకుండా చూడాలని ఆయన కోరారు. మదర్సాలో ఖురాన్ బోధించే వారు వివాహ రహితులుగా ఉండాలన్నారు. అంతేకాకుండా మసీదు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వహణ కమిటీ వారిదేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హారూన్ ఫరాన్, మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు గులాం మొహియుద్దీన్ ఖాన్ పాషాభాయ్, అజీజ్‌ఖాన్ పఠాన్, షకీల్ అలీఖాన్, అజీజ్‌ఖాన్ పఠాన్, జుబేర్ బిన్ అవధ్, సిరాజ్ ఖాన్ పట్టేదార్ తదితరులున్నారు.



మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురం, మధుబన్‌కాలనీకి వెళ్లే మార్గంలో ప్రభుత్వ సర్వే నంబర్ 156/1లో దాదాపు 1,000 గజాల ప్రభుత్వ భూమిని కబ్జాదారులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంపై బీజేపీ నేత, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్మశాలిపురం నుంచి మధుబన్‌కాలనీకి వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 156/1లో దాదాపు 1000 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమణదారుల ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని మండిపడ్డారు. భూ ఆక్రమణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకకుని సదరు ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ ఫోర్జరీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. మొత్తం సర్వే నంబర్‌ను సర్వే చేయించి ప్రభుత్వ భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు ఆదేశించారని చెప్పారు. సర్వే నంబర్ 156/1లో ప్రభుత్వ భూమి వివరాలను ఆర్‌టీఐ చట్టం కింద ఆక్రమణల నివేదికను సేకరించడం జరిగిందన్నారు. భూకబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను రెగ్యులరైజ్ చేసేందుకు జీవో నంబర్ 58,59ను తీసుకొస్తే కొందరు భూకబ్జాదారులు దుర్వినియోగం చేసి కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాన్ని పేద ప్రజలకు ఉపయోగపడేలా ఈ స్థలంలో హాస్పిటల్, కమిటీ హాల్, మహిళ భవనం కోసం కేటాయించాలని కోరారు. ఈ స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సారిక, బీజేపీ డివిజన్ అధ్యక్షులు అడికె జనార్దన్, జిల్లా అధికార ప్రతినిధి తోకల సుధాకర్ రెడ్డి, జోగి రవి, సురేశ్ ముదిరాజ్, బుచ్చిరెడ్డి, తలారి చిన్న, కె.వీ.బాబు, మన్మోహన్, మోహన్, లక్ష్మి, భాగ్యలక్ష్మి, సుధా, తిరుపతమ్మ, కృష్ణారెడ్డి, రామకృష్ణ, సీహెచ్.ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న రామ్మోహన్‌రావు తదితరులు

రాజేంద్రనగర్: సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుద్వేల్ చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభను నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామ్మోహన్‌రావు హాజరై పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుందరయ్య కార్మిక కర్షక నేత ప్రజా ఉద్యమకారుడని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు నిజాం నిరంకుశ పాలనను అంతం చేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని వెల్లడించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, రాజేంద్రనగర్ మండల కన్వీనర్ జె.రుద్రకుమార్, సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కమిటీ నాయకురాలు పార్వతి, బచ్చలకూరస్వామి, భాస్కర్, వెంకటయ్య, చాంద్‌పాషా, రహీం, రాజు, వెంకటేష్‌గౌడ్, రమ్య, స్వాతి, ఈశ్వరమ్మ, సరస్వతి, షబీనా బేగం, వినోద తదితరులున్నారు.

సొంత ఖర్చులతో వీధి దీపాల ఏర్పాటు

శంషాబాద్: ఎయిర్‌పోర్టు కాలనీ 15వ వార్డు పంచవటీ పార్కు వద్ద స్థానిక కౌన్సిలర్ అమృతారెడ్డి తన సొంత డబ్బులతో 40 వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఇటీవల పంచవటీ పార్కు వద్ద గుర్తు తెలియని దుండగులు ఎయిర్‌పోర్టు కాలనీ, కొత్వాల్‌గూడ వాసులపై దాడులు చేసి భయాందోళనకు గురిచేశారు. పంచవటీ పార్కు వద్ద వీధి దీపాలు లేకపోవడమే దీనికి కారణమని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తన సొంత డబ్బుతో వీధి దీపాలను కౌన్సిలర్ ఏర్పాటు చేయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వీధి దీపాల ఏర్పాట్ల పనులను మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు పర్యవేక్షించారు. స్థానికులు కుమార్‌ముదిరాజ్, పూర్ణచంద్ర తదితరులున్నారు.



వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్న కౌన్సిలర్ అమృతారెడ్డి

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి ఈ నెల 25 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్న రమేష్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పూజారుల కోరిక మేరకు స్వామి వారికి నూతనంగా రథాన్ని తయారు చేయించామన్నారు. ఈనెల 24న స్వామి వారిని రథంపై దేవాలయ ప్రాంగణంలో ఊరేగిస్తామన్నారు. ఈరోజు ఉదయం 6.30గంటలకు స్వస్తి వాచనము, విశ్వేక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్వికీవరణం, స్వామి వారికి అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 6గంటలకు అంకురారోహం కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ అధినేత సంతోష్‌రెడ్డి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు.



దేవాలయం, రథం

పేద విద్యార్థినులకు ప్రోత్సాహకం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత మార్కులు సాధించిన పేద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఓ దాత ముందుకొచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 8.5 జీపీఏ సాధించిన ఎ.అఖిలకు రూ.6 వేలు, 7.3 జీపీఏలు సాధించిన పల్లవి, జయశ్రీలకు రూ.4వేల చొప్పున కోకాపేటకు చెందిన భానుమూర్తి అందజేశారు. ఉన్నత చదువులు చదివించేందుకు రూ. 2లక్షల వరకు ఖర్చు చేస్తానని దాత పేర్కొన్నారని ప్రధానోపాధ్యాయురాలు కళావతి వివరించారు. ఉపాధ్యాయులు మాధవరెడ్డి, బల్వంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ వినియోగం వల్లే మరణాలు

రాయదుర్గం: భారతదేశంలో యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌ను ఎదుర్కోవడానికి పరిష్కారాలను గుర్తిస్తూ ఒక నివేదిక విడుదల చేశారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) లోని మ్యాక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక నివేదికను శుక్రవారం విడుదల చేశారు. సరికొత్త యాంటీబయాటిక్స్ యొక్క తక్షణ అవసరం ఉందని నివేదికలో స్పష్టం చేశారు. భారత్‌లో ఏటా ఒక మిలియన్ కంటే ఎక్కువ మంది ప్రజల మరణాలు ఆస్పత్రులు, ఇంట్లో యాంటీ బయాటిక్స్ యొక్క విస్తృతమైన మితిమీరిన వినియోగం, దుర్వినియోగం వల్లే సంభవిస్తున్నాయన్నారు. కేరళ, మధ్యప్రదేశ్, న్యూఢిల్లీ, ఏపీలు మాత్రమే యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) వ్యాప్తిని అరికట్టడానికి కార్యాచరణ ప్రణాళికను కలిగి ఉన్నాయని నివేదికలో స్పష్టం చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మొండ్ర కొమురయ్య

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ కాంతారెడ్డినగర్‌లో సీసీరోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి మొండ్ర కొమురయ్య పరిశీలించారు. రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని ఎండకాలం నేపథ్యంలో క్యూరింగ్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, వీరారెడ్డి, బస్తీవాసులు తదితరులున్నారు.

మజ్జిగ పంపిణీ

మణికొండ: ఎండవేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ మజ్జిగ పంపిణీ చేపట్టింది. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తాలో శుక్రవారం వీఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మజ్జిగను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు బాపూజీ, కార్యదర్శి సీతారాందాస్, కోశాధికారి దిలిప్ కక్కడ్, సభ్యులు లక్ష్మణ్‌రావు, సాంబశివరావు, నాగేంద్రరావు, విజయలక్ష్మి తదితరులున్నారు.



మణికొండలో మజ్జిగ వితరణ చేస్తున్న దృశ్యం

ముగిసిన బాల బాలికల సంస్కార సాధన వర్గ



రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు



సంస్కార సాధనా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీ శారదాధామంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి సంస్కార సాధనా వర్గ ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో అద్భుతమైన శక్తి ఉందని ఆ శక్తిని బయటకి తీయడానికి అనేక వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు రూపొందించామన్నారు. బాలబాలికలకు సంస్కార సాధనలో అభ్యాసం చేపిస్తున్నామన్నారు. మానసిక వికాసం కోసం యోగ, మనోమయ వికాసానికి సంగీతం వేదగణితం, గుణాత్మక వికాసానికి కథలు చెబుతూ.. చక్కటి పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాభారతి అఖిల భారత సదస్సుల కార్యదర్శి కాశీపతి, సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి రవీంద్రశర్మ తదితరులున్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శంషాబాద్ బీఆర్‌ఎస్ నేతలు




వీఆర్‌ఏలు

శంషాబాద్: జీవో 111ను ఎత్తివేస్తూ.. రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో శంషాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు మిఠాయిలు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జీవో 111 పరిధిలోని ప్రజల కష్టాలు తీర్చారన్నారు. జెడ్పీటీసీ తన్వీ, ఎంపీపీ జయమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్ గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు వై.కుమార్, మేకల వెంకటేష్ ముదిరాజ్, నాయకులు నీరటి రాజు, సిద్దులు, శ్రీనివాస్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో రెవెన్యూ కార్యాలయంలోని వీఆర్‌ఏలు శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నీరటి నర్సింహ, జానకిరాం, నర్సింహ, మల్లేష్, రవి, మహేందర్, ప్రసాద్, రాజు, పాండు, కృష్ణ , సురేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో

గోల్కొండ: ఈనెల 20 నుంచి మే 28వ తేదీ వరకు తమ షోరూంలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీతో నిర్వహిస్తున్నామని మెహిదీపట్నం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ హెడ్ రమీజ్ తెలిపారు. శుక్రవారం షోరూంలో పలువురు మోడల్స్ ఆర్టిస్ట్రీ జ్యువెలరీ షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమీజ్ మాట్లాడుతూ.. ఈ షోలో విశిష్టమైన ఆభరణాల ప్రదర్శన ఉంటుందని, బంగారం, వజ్రాభరణాలు, జాతిరత్నాభరణాలను ప్రదర్శిస్తున్నామన్నారు. ఇందులో మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు, పెళ్లి ఆభరణాలతో పాటు ఎరా అన్‌కట్ విశిష్ట శ్రేణి ఆభరణాలు, ప్రెష్యా జాతి రత్నాభరణల ప్రదర్శనలో ఉంటాయని ఆయన తెలిపారు. తాము విక్రయించే ఆభరణాలు 100 శాతం గ్యారెంటీగా ఉంటాయని, బీఐఎస్ హాల్‌మార్క్ ఉంటాయని ఆయన పేర్కొన్నారు.



మ్యూజియం సందర్శన



మ్యూజియాన్ని సందర్శిస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, డాక్టర్ నాగేందర్‌రెడ్డి

చార్మినార్: దేశంలో శక్తివంతమైన మ్యూజియం పర్యావరణ వ్యవస్థకు ఎక్స్‌పో మార్గం సుగమం చేస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. న్యూఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఎక్స్‌పో–2023ను శుక్రవారం ఆయన మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 244 కంటే ఎక్కువ భారతీయ పురాతన వస్తువులను స్వదేశానికి రప్పించడం.. 145 కంటే ఎక్కువ మ్యూజియాల అభివృద్ధి జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కల్పనా అవస్తి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయం సిద్ధం

గోల్కొండ: దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనకు నానల్‌నగర్ తిరుపల్లిగడ్డలోని శ్రీకోవెల రంగనాథస్వామి ఆలయ ప్రాంగణం సిద్ధమైంది. ఈ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి సమేత గోదా రంగనాథ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠింపజేయనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తగా నిర్మించిన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల చరిత్ర గల కోవెల రంగనాథస్వామి ఆలయ పునరుద్ధరణ, నూతన దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 31న లక్ష్మీనరసింహస్వామి సమేత గోదారంగనాథ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన

గోల్కొండ: తాము నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తుందని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. గతంలో కంటే తాము మరిన్ని మెరుగైన సౌకర్యాలతో బస్సులను నడిపిస్తున్నామన్నారు. ప్రస్తుతం అన్ని రూట్లలో బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గోల్కొండ, శంకర్‌పల్లి, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఆ రూట్లలో మరిన్ని బస్సు సర్వీసులు నడపాలని కోరారన్నారు.

అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతా

- ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- గచ్చిబౌలి డివిజన్‌లో రూ.2.56 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

గచ్చిబౌలి/రాయదుర్గం/శేరిలింగంపల్లి: అన్నిరంగాల్లో శేరిలింగంపల్లిని అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని లక్ష్మీవిహార్‌ఫేస్–1లో రూ.25 లక్షలతో సీసీరోడ్డు, నానక్‌రాంగూడలో రూ.21 లక్షలతో యూజీడీ పనులు, రాయదుర్గంలో రూ.94 లక్షలతో సీసీరోడ్లు, వినాయక్‌నగర్‌లో రూ.1.05 కోట్లతో సీసీరోడ్ల పనులు, వినాయక్‌నగర్‌లో రూ.11 లక్షల వ్యయంతో చేపట్టే మంజీరా పైప్‌లైన్ పనులకు ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. శేరిలింగంపల్లిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సీసీరోడ్లు, లింకురోడ్లు, బీటీరోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించడం జరిగిందన్నారు. దుర్గంచెరువు, మల్కంచెరువుతోపాటు మిగతా అన్ని చెరువులను సుందరీకరించి పరిసర కాలనీలు,బస్తీల ప్రజలు సేద తీరే ప్రాంతాలుగా దశలవారిగా వాటిని మార్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కాలనీలు,బస్తీలలో పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మెరుగైన జీవనానికి అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, సత్యనారాయణ, జంగయ్యయాదవ్, నరేష్, వినోద్, రమేష్‌గౌడ్, వసంతకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, దాసరిగోపి, సతీష్, యాదగిరి, జగదీష్, అంజమ్మ, మాధవి, ఖాదర్‌ఖాన్,రమేష్ ,ఆయా కాలనీలవాసులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు